జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజలకోసం
## కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల -పెద్దపల్లి
బుధవారం 09-7-2025 పేజీలు : 8



## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి

- అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తాం
- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు

సుల్తానాబాద్ జులై 8 (ప్రజాజ్యోతి) : సుల్తానాబాద్ మండలంలోని కందునూరిపల్లి, నారాయణపూర్, కొదురుపాక దేవునిపల్లి చిన్నకల్వల గ్రామాల్లో మంగళవారం రోజున సిసి రోడ్లు, డ్రైనేజీలు, హెల్త్ సెంటర్, కమ్యూనిటీ హాల్, బోర్ వెల్ శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను అందజేసి ముగ్గులు పోసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు అనంతరం సుల్తానాబాద్ మండలం నారాయణపూర్ గ్రామంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలలో పాల్గొని కేక్ కట్ చేసిన అనంతరం వైయస్ రాజశేఖర్ రెడ్డి సేవలను కొనియాడారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యేవిజయరమణరావు మాట్లాడుతూఃఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి గ్రామంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు అందించి వారి కళ్ళల్లో ఆనందం చూసేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే విజయరమణ రావు అన్నారు.

మిగతా 7లో...

## మండల కాంగ్రెస్ పీఠం ఎవరికి

- పోటీలో ఆ ఐదుగురు
- ముందంజలో ఇద్దరు

రామగిరి, జులై 08 (ప్రజాజ్యోతి) : రామగిరి మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవి నియామక ప్రక్రియ ఇప్పుడు కీలక దశకు చేరుకుంది. ఇటీవల అధినాయకత్వం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పూర్తి చేయగా, మొత్తం పదిమందికి పైగా ఆసక్తి కనబరిచారు. అయితే, వీరిలో ఐదుగురు నేతలు మాత్రమే పైపోటీలో కొనసాగుతున్నారని విశ్వసనీయ సమాచారం. రాజకీయ అనుభవం, పార్టీలోని సేవా దశలు, ప్రజల్లో ఉన్న విశ్వాసం, ప్రస్తుత పరిస్థితుల్లో నాయకత్వ సామర్థ్యం వంటి అంశాల ఆధారంగా ఈ ఎంపిక ప్రక్రియ సాగనుంది. ఈ నాయకుడు 1986-87 నుంచే కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి యూనియన్ అయిన ఎన్ఎస్యూఐ లో మండల అధ్యక్షునిగా పనిచేశారు. ఆ రోజుల నుంచే కాంగ్రెస్ సూత్రాలు, ఉద్యమాలు, ప్రజాపక్షపాతం పట్ల నిబద్ధత కనబరిచారు. నాలుగు దశాబ్దాల రాజకీయ జీవనంలో అనేక శిబిరాలు, ఉద్యమాల్లో పాల్గొంటూ కార్యకర్తల మనసుల్లో స్థిరమైన స్థానం సంపాదించారు. ఇవాళ కార్యకర్తలు “ఆయనే నేతగా కావాలి” అనే స్థాయిలో మద్దతునిచ్చే పరిస్థితి కనిపిస్తోంది.

మిగతా 3లో...





## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- ప్రైవేటు నుండి ప్రభుత్వ పాఠశాలకు 35 మంది విద్యార్థులు
- లింగాపూర్ ఎంపీపీఎస్ ఆదర్శనీయం
- తల్లిదండ్రుల సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

2 లో..



# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

**ప్రైవేటు నుండి ప్రభుత్వ పాఠశాలకు 35 మంది విద్యార్థులు**

**లింగాపూర్ ఎంపీపీఎస్ ఆదర్శనీయం**

**తల్లిదండ్రుల సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**





**కరీంనగర్ బ్యూరో,జూలై 08, (ప్రజాజ్యోతి)**


అన్ని సౌకర్యాలతో కూడిన ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతోందని, ప్రైవేట్ పాఠశాలల నుండి 35 మంది విద్యార్థులు లింగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చేరడం ఇందుకు నిదర్శనమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మానకొండూరు మండలం లింగాపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశానికి పేరెంట్స్ కచ్చితంగా హాజరు కావాలని అన్నారు. అప్పుడే పిల్లల చదువు తీరును తెలుసుకోవచ్చని, ఉపాధ్యాయులతో మాట్లాడి మరింత మెరుగుపరచవచ్చని అన్నారు. ఐదవ తరగతి లోపు విద్యార్థుల పట్ల అత్యంత శ్రద్ధ అవసరమని, ప్రభుత్వ పాఠశాలలో ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లింగాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు వివిధ ప్రైవేటు పాఠశాలల నుండి 35 మంది విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో చేరడం గొప్ప విషయం అన్నారు. ఇందుకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు. ఈ గ్రామంలో ఐదేళ్లు నిండిన అంగన్వాడి చిన్నారులు మొత్తం మంది ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేరడం, ఏడవ తరగతి పూర్తి చేసిన నూరు శాతం విద్యార్థులు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చేరడం పట్ల కలెక్టర్ అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేసే వాట్సాప్ గ్రూపులు, యూట్యూబ్ ఛానల్ ద్వారా తల్లిదండ్రులు ప్రభుత్వ విద్యా విధానాన్ని తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థుల తల్లిదండ్రులతో ముచ్చటించారు. రెండవ తరగతి విద్యార్థినిని ఒడిలో కూర్చుండబెట్టుకొని న్యూస్ పేపర్ చదివించారు. పలువురు విద్యార్థులు ప్రయోగాత్మకంగా నేర్చుకున్న అంశాలను కలెక్టర్ కు వివరించారు. అనంతరం తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో తీసుకున్న చర్యల పట్ల అభినందించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, ఎంఈఓ మధుసూదన్, తహసిల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీవో వరలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ జియ్యంగార్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పరిశీలన**

మానకొండూరు మండలం లింగపూర్ లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. లబ్ధిదారు తాళ్ల భాగ్య కుటుంబ సభ్యులతో మాట్లాడి నిర్మాణంలో ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణం వేగంగా పూర్తి చేసుకోవాలని, దశలవారీగా సొమ్ము జమ చేయిస్తామని అన్నారు. లబ్ధిదారు ఇల్లు బేస్మెంట్ లెవెల్ పూర్తవుతున్నందున లక్ష రూపాయలు జమ చేసేలా తక్షణం చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరలక్ష్మి, తహసిల్దార్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## విజయవంతంగా లాప్రో స్కోపిక్ సర్జరీ, ల్యాపారాటమీ సర్జరీ నిర్వహణ

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**





**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ,(ప్రజాజ్యోతి), జూలై - 08:**

పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో విజయవంతంగా లాప్రో స్కోపిక్ సర్జరీ నిర్వహించిన వైద్య బృందాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందిస్తూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన 30 సంవత్సరాల ఒక మహిళ గత కొంత కాలంగా గ్లాడ్ బ్లాడర్ నెక్ లో స్టోన్ ఉండడము వల్ల కరీంనగర్ లో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో అడ్మిటై ఇ.ఆర్.సి.పి, స్టేటింగ్ చేయించుకుంది. ఈమె తీవ్రమైన గ్లాడ్ బ్లాడర్ ఇన్ఫెక్షన్ పాక్రియస్ ఇన్ఫెక్షన్ లతో బాధ పడుతూ. మూడు రోజుల క్రితం డా. కె. శ్రీధర్ గారిని సంప్రదించగా, వెంటనే స్పందించి అవసరమైన రక్త పరీక్షలు, స్కానింగ్, 2డి ఎకో లాంటి పరీక్షలు నిర్వహించి పేషెంట్ ను అడ్మిట్ చేసుకున్నారు. నేడు సదరు మహిళకు జిల్లా ఆసుపత్రిలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో లాప్ సర్జన్ డా. శ్రీకాంత్, జనరల్ సర్జరీ డా . సాయి ప్రసాద్, మత్తు వైద్యులు డా. కృష్ణవేణి, డా. స్వాతి విజయవంతంగా లాప్రో స్కోపిక్ సర్జరీ నిర్వహించారు. అదేవిధంగా పెద్దపల్లి పట్టణానికి చెందిన 35 సంవత్సరాల ఒక మహిళ ఉదయం ఓ పి లో తీవ్రమైన కడుపు నొప్పితో రాగా వెంటనే స్కానింగ్ చేస్తే గర్భ సంచి పక్కకు వున్నా అండాశయము మెలిక పడి గ్యాగ్రినుగా మారడం జరిగింది. ఇదే మహిళకు కడుపులో ఒక్క లీటర్ వరకు రక్త స్రావము జరిగినది. వెంటనే స్పందిచిన వైద్యులు డా. స్రవంతి, గైనకలజిస్ట్, డా. సౌరయ్య, మత్తు వైద్యులు మరియు డా. కె. శ్రీధర్, మెడికల్ సూపరింటెండెంట్ సర్జరీ నిర్వహించి చెడిపోయిన భాగాన్ని తొలగించడము జరిగింది. ఎమర్జెన్సీ లో స్పందించి ఈ సర్జరీ చేయడం వల్ల ఆ మహిళకు ప్రాణాపాయ ముప్పు తప్పింది .జిల్లా ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు ప్రజలు ఉపయోగించుకోగలరని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి డా:వైయస్ జయంతి వేడుకలు



**కోనరావుపేట: జూలై.8(ప్రజా జ్యోతి)**

దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి డా: వైయస్ రాజశేఖర్ రెడ్డి 76 వ జయంతి వేడుకలను మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు ఒక రూపాయికే కిలో బియ్యం రాజీవ్ ఆరోగ్యశ్రీ విద్యార్థులకు ఫీజు రిమెంబర్స్ వంటి పథకాలతో ప్రజల గుండెల్లో చిరస్థాయిలో నిలిచారని కొనియాడారు అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండు సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారని అలాగే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంతో పాటు కేంద్రంలో కూడా అధికారంలోకి రావడానికి ఎంతో కృషి చేశారని అన్నారు ఆయన చేసిన కృషితో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల గుండెల్లో దేవుడిగా నిలిచారని తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు షేక్ ఫిరోజ్ పాషా కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు కేతిరెడ్డి జగన్ రెడ్డి నాలుక సత్యం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బండి ప్రభాకర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మాందాల లింబయ్య మేకల ప్రభాకర్ సీనియర్ నాయకులు మూదం ప్రదీప్ మధుకర్ రెడ్డి బుర్ర రవి ములిగ నవీన్ పాకాల వినయ్ నక్క నవీన్ తదితరులు పాల్గొన్నారు

## సింగిల్ విండో ఆధ్వర్యంలో రైతులకు మరిన్ని సేవలు



**సుల్తానాబాద్ జులై 8 (ప్రజాజ్యోతి)**

అంతర్జాతీయ సహకార సంవత్సరం లో భాగంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చిన్నకలువల సంఘ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో పెట్రోల్ పంప్ వద్ద, వన మహోత్సవం,పెట్రోల్ పంపు ఆరవ వార్షికోత్సవం జరుపుకోవడం జరిగినది ఇందులో భాగంగా పెట్రోల్ పంపులో రోజువారీగా పెట్రోల్ డీజిల్ వినియోగదారులకు 9 మంది లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసి ఇండియన్ ఐఓసి వారిచే బహుమతి ప్రధానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో శ్రీ మాల జిల్లా సహకార అధికారి,ఎన్ .సత్యనారాయణరావు సీఈవో కరీంనగర్ జిల్లా సింగిల్ విండో చైర్మన్ దేవర్నేని మోహన్ రావు , ఎన్ .ఆకాష్ ఐ ఓ సి కంపెనీ సూపర్వైజర్ అసిస్టెంట్ రిజిస్టర్ వెంకటేశ్వర్లు,శ్రీనివాస్ కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ శేషిధర్ రావు సూపర్వైజర్ అబ్దుల్ సమీ సీఈఓ వల్లకొండ రమేష్ ఉపాధ్యక్షులు కందుల రాజు,అన్నమనేని మాధవరావు, మామిడి లింగయ్య, గుర్రం సత్తయ్య,మేకల వీరయ్య,తాండ్ర నిర్మల, భూస్నవేని విజయ్,పాలకవర్గ సభ్యులు తో పాటు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుని కుటుంబాన్ని పరామర్శించిన ప్రభుత్వ విప్



**కొనరావుపేట: జూలై.8(ప్రజా జ్యోతి)**

మండల కేంద్రంలోని ధర్మారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు అతికం శ్రీనివాస్ గౌడ్ తండ్రి ఆగయ్య గౌడ్ ఇటీవలే మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరామర్శించారు అతని వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు షేక్ ఫిరోజ్ పాష మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంగలి వెంకన్న గొట్టే రుక్మిణి మాజీ సర్పంచ్ లచ్చవ్వ నందు గౌడ్ అంజయ్య బోయిని దేవరాజు డాక్టర్ దేవదాస్ తదితరులు ఉన్నారు.

## ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన ప్రజానాయకుడు వైఎస్సార్

**- రామగిరిలో ఘనంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు**



**రామగిరి, జూలై 5 (ప్రజాజ్యోతి) :**
ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన ప్రజానాయకుడు వైఎస్సార్ అని మండల కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ దివంగత దిగ్గజ నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి వేడుకలు శనివారం రామగిరి మండలంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. సెంటినరీ కాలనీ కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు కాటం సత్యం ఆధ్వర్యంలో శ్రీపాద భవన్ ఐఎన్టీయూసీ కార్యాలయంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలు ఎనలేనివని, ఆయన పాలనలో పేదల బాగోగులకు ఎంతో ప్రాధాన్యం కల్పించారని తెలిపారు. పాదయాత్రల ద్వారా ప్రజల మనసుల్లో స్థానం సంపాదించి, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల ద్వారా ప్రజలకు వెలమట్టలేని మేలు చేశారని కొనియాడారు. అయన పాలనలో గ్రామీణాభివృద్ధికి, సాగునీటి ప్రాజెక్టులకు గణనీయమైన నిధులు కేటాయించారని, పేదల పక్షపాతిగా ప్రజల గుండెల్లో ఆయన పేరు సుస్థిరంగా నిలిచిపోయిందని చెప్పారు. వైఎస్సార్ నాయకత్వ లక్షణాలు, ప్రజల పట్ల కలిగిన నిజమైన ప్రేమ ఆయనను దైవసమాన నాయకునిగా మలిచాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య, మాజీ ఎంపీపీలు అరేల్లి దేవక్కా, కొమురయ్య గౌడ్, నీరజ తులసిరామ్ గౌడ్, మాజీ జడ్పీటీసీలు మైదం భారతి, వరప్రసాద్, ఎల్లే రాంమూర్తి, మాజీ ఎంపీటీసీలు ముస్త్యాల శ్రీనివాస్, తీగల సమ్మయ్య, బాబురావు, దాసరి శివ, ఐఎన్టీయూసీ నేతలు బంకు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల కోసం సమ్మె తప్పనిసరి

**- కార్మిక యూనియాన్స్ జేఏసీ పిలుపు**

**రామగిరి, జూలై 8 (ప్రజాజ్యోతి) :**



జూలై 9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి కార్మిక యూనియన్ల నాయకులతో కలిసి, జేఏసీ కన్వీనర్, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఓసిపి-1, ఓసిపి-2, సి-5 కంపెనీ ప్రాంగణాల్లో కార్మికులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ "కేంద్ర బీజేపీ ప్రభుత్వం అమలు చేయాలను కుంటున్న కొత్త లేబర్ కోడ్‌లు కార్మిక హక్కులను కాలరాసేలా ఉన్నాయి. కనీస వేతనాల విషయంలో స్పష్టత లేకపోవడం, పనిగంటలు 12 గంటలుగా పెంచే ప్రయత్నం, అలవెన్సులు తొలగింపు, రిజర్వేషన్లపై ప్రభావం తదితర అంశాలు కార్మిక వర్గాన్ని అంధకారంలోకి నెట్టేలా ఉన్నాయి" అని విమర్శించారు. ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీ వైవీ రావు, సీఐటియు బ్రాంచ్ సెక్రటరీలు కూడా ఈ సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు. సింగరేణి బొగ్గు గనులను ప్రైవేటీకరణ పేరుతో అమ్మకానికి పెట్టడం వల్ల కొత్త బ్లాకులు రావడం లేదని, ఇది సంస్థ భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందన్నారు. కార్మికులందరూ ఈ సమ్మెలో పాల్గొని తమ ఐక్యతను చాటుకోవాలన్నారు. జేఏసీ యూనియన్ నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్న ఈ సమావేశాల్లో నేడు జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని, కార్మికుల హక్కుల రక్షణ కోసం సంఘీభావంగా నిలవాలని పిలుపునిచ్చారు.

# మండల కాంగ్రెస్ పీఠం ఎవరికి?

**- పోటీలో ఆ ఐదుగురు - ముందంజలో ఇద్దరు**



**రామగిరి, జూలై 08 (ప్రజాజ్యోతి) :**
రామగిరి మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవి నియామక ప్రక్రియ ఇప్పుడు కీలక దశకు చేరుకుంది. ఇటీవల అధినాయకత్వం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పూర్తి చేయగా, మొత్తం పదిమందికి పైగా ఆసక్తి కనబరిచారు. అయితే, వీరిలో ఐదుగురు నేతలు మాత్రమే పైపోటీలో కొనసాగుతున్నారని విశ్వసనీయ సమాచారం. రాజకీయ అనుభవం, పార్టీలోని సేవా దశలు, ప్రజల్లో ఉన్న విశ్వాసం, ప్రస్తుత పరిస్థితుల్లో నాయకత్వ సామర్థ్యం వంటి అంశాల ఆధారంగా ఈ ఎంపిక ప్రక్రియ సాగనుంది.

**1. ఎన్ఎస్యూఐ నుండి మొదలు :**
ఈ నాయకుడు 1986-87 నుంచే కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి యూనియన్ అయిన ఎన్ఎస్యూఐ లో మండల అధ్యక్షునిగా పనిచేశారు. ఆ రోజుల నుంచే కాంగ్రెస్ సూత్రాలు, ఉద్యమాలు, ప్రజాపక్షపాతం పట్ల నిబద్ధత కనబరిచారు. నాలుగు దశాబ్దాల రాజకీయ జీవనంలో అనేక శిబిరాలు, ఉద్యమాల్లో పాల్గొంటూ కార్యకర్తల మనసుల్లో స్థిరమైన స్థానం సంపాదించారు. ఇవాళ కార్యకర్తలు "ఆయనే నేతగా కావాలి" అనే స్థాయిలో మద్దతునిచ్చే పరిస్థితి కనిపిస్తోంది.

**2. గ్రామ సర్పంచ్‌గా ఆరంభించి, జిల్లా స్థాయిలో కొనసాగిన నేత :**
ఇంకొకరు గ్రామ సర్పంచ్‌గా పని చేసి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీలోనూ పని చేసిన అనుభవాన్ని కలిగిన నేత. పాలనా అనుభవం, వ్యవస్థాపిత సంబంధాలు, జిల్లా స్థాయిలో మంచి అనుబంధం కలిగి ఉండటం, ప్రస్తుతం మండలానికి అవసరమైన పరిపక్వత కలిగిన నాయకుడిగా ఎదిగారు. పార్టీ మార్గదర్శకతలో భాగంగా ఉద్యమ శక్తిని సమీకరించగల నాయకుడిగా ప్రసిద్ధి పొందారు.

**3. జెడ్పీటీసీ, సర్పంచ్‌గా అనుభవం కలిగిన అభ్యర్థి :**
జెడ్పీటీసీగా, సర్పంచ్‌గా పని చేసిన రాజకీయ అనుభవం ఉంది. పాలనా పరంగా ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిష్కరించిన చరిత్ర ఉండటం, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రధాన పాత్ర పోషించడం, నియోజకవర్గ స్థాయిలో సంబంధాలతో పాటు పార్టీకి శ్రమ చేస్తున్న వృద్ధి శక్తిగా గుర్తింపు పొందారు. కాకపోతే గత ఎన్నికల్లో వివిధ కారణముతో పార్టీ మరినా, వెను వెంటనే కాంగ్రెస్ పార్టీలో చేరికయ్యారు.

**4. మండలంలో పటిష్ఠ పట్టు సాధించిన క్రియాశీల నేత :**
ఈ అభ్యర్థి సర్పంచ్, ఎంపీటీసీగా పని చేసిన అనుభవంతో పాటు పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లోనీ కార్యకర్తలతో పరస్పర తత్స సంబంధాలు ఏర్పరచుకొని, పార్టీ పునర్నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. క్రియాశీల కార్యకర్తలతో పార్టీని బలోపేతం చేస్తున్నారు. ప్రస్తుతం ఈయనకు మాజీ ప్రజా ప్రతినిధులు నాయకుల నుంచి కూడా బలమైన మద్దతు లభిస్తోంది.

**5. హెడ్‌క్వార్టర్ కేంద్రంగా వ్యూహాత్మక ప్రయాణం సాగిస్తున్న యువ నేత :**
మండల కేంద్రంలో నివాసం ఉన్న, ఎంపీటీసీగా పనిచేసిన అనుభవం కలిగిన ఈ యువ నాయకుడు, పార్టీకి తక్షణ పరిష్కారాలు అందించే శక్తిగా ఎదుగుతున్నారు. మండల కార్యాలయం పరిసరాల్లో పార్టీ పనులను సమన్వయించడంతో పాటు, యువతను ఆకర్షించే మార్గంలో మంచి విజయాన్ని అందుకున్నారు. వారి మౌన వ్యూహాలు, సమకాలీన పాలనా అర్థన, అధినాయకత్వంతో నిబద్ధ సంబంధాలు ఆయనకు విశేషంగా కలిసొస్తున్నాయి.

**తుది నిర్ణయం కోసం ఎదురుచూస్తున్న ఇతర నేతలు, కార్యకర్తలు :**
ప్రస్తుతం ఐదుగురి మధ్య స్పష్టమైన పోటీ కొనసాగుతుండగా, తుది నిర్ణయం ఎవరిపై పడుతుందన్న ఉత్కంఠ మండలవ్యాప్తంగా పెరిగిపోతున్నది. ప్రతి అభ్యర్థి వెనుకూ ఒక వర్గం, ఒక ఆశ, ఒక దిశ ఉన్నా%ా% చివరికి అధినాయకత్వం ఎలాంటి దృక్కోణాన్ని అనుసరిస్తుందన్నది ఇప్పుడు కాంగ్రెస్ శిబిరాల్లో హాట్ టాపిక్. రామగిరి కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎన్నిక కేవలం ఒక రాజకీయ నియామకమే కాదు - అది పార్టీని కొత్త దశకు తీసుకెళ్లే మైలురాయి కావొచ్చు. అనుభవానికీ, ఆధునికతకీ మధ్య జరుగుతున్న ఈ పోటీ, నాయకత్వ తీర్పుతో ముగుస్తూ, రాబోయే మార్గాన్ని స్పష్టతపరచనుంది.



## అధ్యక్ష పదవికి ముందంజలో ఇద్దరు

రామగిరి మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవికి సంబంధించి చోటుచేసుకుంటున్న తాజా రాజకీయ పరిణామాలు, కాంగ్రెస్ పార్టీలో కొత్త దశ ప్రారంభానికి సంకేతాల్లా మారాయి. పదవికి దరఖాస్తు చేసినవారు పది మందికి పైగా ఉన్నప్పటికీ, వాస్తవ పోటీ మాత్రం ఇద్దరు ప్రధాన నేతల మధ్యే సాగుతుందని పార్టీ వర్గాల అభిప్రాయం. ఈ ఇద్దరు కూడా విభిన్న శైలుల్లో, విభిన్న మౌలిక బలాలతో పార్టీకి సేవలందించినవారే. ఒకరు గ్రామీణ స్థాయిలో సమావేశాల సమన్వయంతో పార్టీకి బలాన్నిచ్చిన అనుభవజ్ఞుడు. గతంలో సర్పంచ్, ఎంపీటీసీగా పనిచేసిన ఈ నేత, పార్టీ పటిష్టత కోసం సంవత్సరాల తరబడి శ్రమించినవారు. కార్యకర్తల్లో విశ్వాసాన్ని కలిగించుకున్న ఆయన, పదవికి అర్హత ఉన్న వ్యక్తిగా ప్రచారంలో ఉన్నారు. మరోవైపు, మండల కేంద్రంలో నివసించే యువ నేత తన వ్యూహాత్మక కార్యాచరణతో మౌనంగా కానీ శక్తివంతంగా ఎదుగుతున్నారు. పార్టీ అధినాయకత్వంతో ప్రత్యక్ష సంబంధాలు, త్వరిత స్పందనతో సమస్యల పరిష్కారం, యువతలో ఆదరణ., ఇవన్నీ ఆయనకు ప్రయోజనంగా మారుతున్నాయి. ఈ రెండేళ్లుగా జిల్లా రాజకీయాల్లో వారి పాదాలు పదునెక్కుతుండటం గమనార్హం. ఒకరు పాత తరం రాజకీయ శైలికి ప్రతినిధిగా నిలిచితే, మరొకరు కొత్త శకం అవసరాల ప్రకారం పార్టీని నడిపించగల నూతన శక్తిగా విభిన్నతను చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధినాయకత్వం తీసుకోబోయే తుది నిర్ణయం పార్టీలో నూతన ధోరణులనూ, భావితరాల ఆశయాలనూ ప్రతిబింబించబోతున్నది. ఈ పోటీ కేవలం వ్యక్తుల మధ్య కాదని, పార్టీలో మారుతున్న రాజకీయం, కొత్త నాయకత్వ శైలుల మధ్యలో ఓ మైలు రాయిగా మారుతుందని విశ్లేషకుల అభిప్రాయం. దీంతో, రామగిరి మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవికి సంబంధించిన ఈ పోటీ, పార్టీ మార్గదర్శకాన్ని నిర్ణయించే కీలక ఘట్టంగా అభివర్ణించబడుతోంది.

# పది ఏళ్ళైనా బదిలీ కానీ సింగరేణి అధికారులు

**- ఫోకల్ పోస్టులపై తిష్ట వేసిన నేతల సన్నిహితులు..**

**- పదేళ్లుగా ఓచోటే.. - నిబంధనలకు తూట్లు.. - బదిలీలాకు బీజేపీ నేత మొల్మురి డిమాండ్..**



**రామగిరి, జూలై 5 (ప్రజాజ్యోతి) :** సింగరేణిలో పదేళ్లకు పైగా ఒకే పోస్టులో కొనసాగుతున్న అధికారులపై బదిలీలను అమలు చేయాలని బీజేపీ వర్గాలు అధికార యంత్రాంగంపై ఒత్తిడి తెస్తున్నాయి. ఫోకల్ పోస్టులపై కొంతమంది తిష్ట వేసుకుని, రాజకీయ నాయకులు, కార్మిక యూనియన్ నేతల ఆధారంగా అవినీతికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ ఫోరం జిల్లా అధ్యక్షుడు ములుమూరి శ్రీనివాస్ శుక్రవారం సెంటినరీ కాలనీలో విలేకరులతో మాట్లాడుతూ, “ఒకే ఏరియాలో పదేళ్లుగా కొనసాగే అధికారుల వెనుక ఎవరి అండదండలు ఉన్నాయి? వారిని రక్షిస్తున్నది ఎవరు? నీటిపై రాతలు మాదిరిగానే నియమాలు కూడా సింగరేణిలో చెరిగిపోయాయా?” అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేంద్రీయ మార్గదర్శకాల్లో స్పష్టంగా ఫోకల్ పోస్టుల్లో మూడు సంవత్సరాల కంటే ఎక్కువ ఉండరాదని ఉన్నప్పటికీ, కొంతమంది అధికారులు సింగరేణి వివిధ ఏరియాల్లో పదేళ్లుగా తిష్ట వేసుకుని, కీలక నిర్ణయాలన్నింటినీ ముట్టడించి వదలడం లేదన్నారు. ఇదంతా రాజకీయ, కార్మిక యూనియన్ మద్దతుతోనే జరుగుతోందన్న ఆరోపణలను ఆయన నిశితంగా విసిరారు. “అభివృద్ధి పేరుతో కొనసాగుతున్న ఈ పునరావృత పాలన వెనుక నిజంగా అభివృద్ధే ఉందా? లేక స్వార్థానికే ఆధిక్యతా?” అని నిలదీశారు. అంతేగాక, ఈ అధికారులు స్థానిక కార్మిక యూనియన్ నాయకులతో చేతులు కలిపి నియామకాల్లో, కాంట్రాక్టులలోకొనుగోళ్లలో అనేక అవకతవకలకు పాల్పడుతున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని గుర్తు చేశారు. “వారి రాజకీయ నేపథ్యం వారిని రక్షిస్తున్నా, సంస్థ పరిరక్షణ కోసం యాజమాన్యం తక్షణ నిర్ణయం తీసుకోవాలి” అని అన్నారు. బదిలీలపై నిర్లక్ష్యం కొనసాగితే ఈ అంశాన్ని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లే కార్యక్రమం చేపడతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ నేతలు తీగల శ్రీధర్, మెరుగు శ్రీకాంత్ పాల్గొన్నారు.

# సమ్మెలకు దూరంగా ఉండండి... విధులకు హాజరుకాండి

**- సంస్థాభివృద్ధికి కార్మికుల సహకారం అవసరం - ఆర్జీ-3 జీఎం సుధాకరరావు**

**రామగిరి, జూలై 8 (ప్రజాజ్యోతి) :** ఈ నెల 9న కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన సమ్మెలకు దూరంగా ఉండి విధుల్లో పాల్గొనాలని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర.సుధాకరరావు కోరారు. అడ్రియాల ప్రాజెక్ట్ జీఎం కొలిపాక నాగేశ్వరరావుతో కలిసి సోమవారం వివిధ విభాగాల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, సింగరేణి సంస్థ పరిధిలో ఉన్న సమస్యలు చర్చల ద్వారా పరిష్కరించ గలవు. సమ్మె ద్వారా సంస్థకు నష్టం, కార్మికులకు వేతన నష్టం తప్ప మరొక లాభం ఉండదు అని స్పష్టం చేశారు. ప్రస్తుతం వర్షాల ప్రభావంతో ఉత్పత్తిలో ఇప్పటికే అంతరాయం ఏర్పడిందని, జూలై-ఆగస్ట్‌లో ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం ప్రతి ఒక్కరి సహకారం అవసరమని అన్నారు. సమ్మె డిమాండ్లలో చాలా వరకు సింగరేణికి సంబంధించనివే అని పేర్కొంటూ, కార్మికులు అపోహలకు లోనుకాకుండా, యాజమాన్యం ఇచ్చే వివరణలను విశ్వసించి విధుల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



ఈ సమావేశంలో ఏరియా ఇంజినీర్ వై.వి. శేఖర్ బాబు, ఎస్వోటు జీఎం ఎం.రామ్మోహన్, ప్రాజెక్ట్ అధికారులు సిహెచ్. వెంకటరమణ, జె. రాజశేఖర్, ప్రవీణ్ వి ఫాటింగ్, విభాగాధిపతులు కాశీ విశ్వేశ్వరరావు, చంద్రశేఖర్, సుదర్శనం, రాజేంద్రకుమార్, కళ్యాణ చక్రవర్తి, షబ్బిరుద్దీన్, మేనేజర్లు కె.వి. రామారావు, పాపయ్య, డిపియం గుర్రం శ్రీహరి, సీనియర్ పీఓ రవిచంద్ర, సంక్షేమ అధికారులు, కాంట్రాక్టర్ల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# చదువుకు చేయూత.. విద్యార్థులకు కలం కాగితాల కానుక

**- తండ్రి జ్ఞాపకార్థంగా...విద్యార్థులకు విరాళం**

**రామగిరి, జూలై 8 (ప్రజాజ్యోతి) :** తన తండ్రి కీ.శే సౌమిత్రి.నారాయణచార్యులు (శాస్త్రులు, అయ్యగారు) జ్ఞాపకార్థంగా హైదరాబాద్ చిలుకలగూడకు చెందిన సౌమిత్రి.తిరుమలాచార్యులు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటుబుక్కులు, పెన్నులు, పెన్సిల్లు పంపిణీ చేశారు. కల్వచర్ల గ్రామంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికి ఆరు బుక్కులు, రెండు పెన్నులు చొప్పున మొత్తం 600 నోటుబుక్కులు అందించగా, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికి మూడు బుక్కులు చొప్పున 200 బుక్కులు, మొత్తం కలిపి 800 నోటుబుక్కులు, 200 పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిరుమలాచార్యులు మాట్లాడుతూ, విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత శ్రేణుల్లో ఉత్తీర్ణులు కావాలి. గత సంవత్సరం లాగే పదో తరగతిలో ఉత్తమంగా ప్రదర్శన ఇచ్చిన మొదటి ముగ్గురు విద్యార్థులకు స్వాతంత్ర దినోత్సవం రోజున రూ.5000, రూ.3000, రూ.2000 నగదు బహుమతులు అందజేస్తానని తెలిపారు. తన సొంత ఊరిపై మమకారంతో గత నాలుగు సంవత్సరాలుగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు విద్యా సామగ్రిని అందజేస్తూ సమాజం పట్ల బాధ్యతను చాటుకుంటున్న తిరుమలాచార్యులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయురాలు దేవళ్ల.వనజ చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు కుంట.వెంకటేశం, గుండేటి.సత్యనారాయణ, మల్లారం.శంకర్, ఆడెపు.రవి, పిఈటి.దేవేందర్ నేతృత్వంలో మంగళవారం పాఠశాలలో విజయవంతంగా నిర్వహించారు.



**రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుపై**

# పర్సనల్ డైరెక్టర్‌కి వినతి

**- ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల పదోన్నతులపై**

**చర్యలు తీసుకోవాలని బత్తుల శంకర్ విజ్ఞప్తి**



**రామగిరి, జూలై 8 (ప్రజాజ్యోతి) :** సింగరేణి సంస్థలో రిజర్వేషన్ అమలు తీరుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం నూతన పర్సనల్ డైరెక్టర్ గౌతమ్ పోట్రో (ఐఏఎస్) ను ఆర్జీ-3 ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం (140/2018) వైస్ ప్రెసిడెంట్ బత్తుల శంకర్ మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ సంస్థలో ఉన్న రోస్టర్ ఖాళీలను యాక్టింగ్ బావిలతో కలిపి పెండింగ్‌లో ఉన్న పదోన్న తులను పూర్తి చేయాలని కోరారు. విభాగాల వారీగా పెండింగ్ లో ఉన్న పోస్టులను త్వరితగతిన భర్తీ చేసి, రిజర్వేషన్ హక్కులు లాంఘనకు గురికాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఆర్థిక స్వావలంబన లేకుండా సమాజంలో ఎస్సీ, ఎస్టీల స్థితి మెరుగవదని, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా రిజర్వేషన్లను అమలు చేయాలని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై స్పందించిన పర్సనల్ డైరెక్టర్ గౌతమ్ పోట్రో మాట్లాడుతూ, జనరల్ మేనేజర్లతో చర్చించి, బావిల్లో ఖాళీలపై బోర్డుపై నోటీసులు వేయించేందుకు చర్యలు తీసుకు ంటామని తెలిపారు. రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్లను గౌరవించడమే సంస్థ ధోరణి అని పేర్కొన్నారు.

# దేశవ్యాప్త సమ్మెపై సింగరేణి ఆర్జీవన్ జిఎం సమీక్ష

**సమ్మెకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి**



**గోదావరిఖని , జులై 8 (ప్రజాజ్యోతి)** దేశవ్యాప్తంగా జాతీయ కార్మిక సంఘాలు బుధవారం తలపెట్టిన సార్వత్రిక సమ్మెపై సింగరేణి ఆర్జీ వన్ జిఎం డి.లలిత్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు.మంగళవారంఆర్జీ1 జియం కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఆర్జీ1 లోని వివిధ గనులు,డిపార్ట్మెంట్ ల అధికారులు హాజరయ్యారు.కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మెలో సింగరేణికి సంబంధించిన సమస్యలు చాలా తక్కువగా ఉన్నాయని, సింగరేణి కార్మికుల సమస్యలు ఏవైనా ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.ఈ సమ్మకు కార్మికులు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.ఇలా సమ్మెకు దిగడం సమంజసం కాదన్నారు.ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన బొగ్గు లక్ష్యం,జూలై,ఆగస్టు మాసాలలో అధిక వర్ష శాతం ఉన్నందున నిర్దేశించిన లక్ష్యం కోసం పాటుపడాలన్నారు.ఒక్కరోజు సమ్మె చేయడం వల్ల కంపెనీ కలిగే ఉత్పత్తి నష్టం సుమారు రూ.76 కోట్లు అని, కార్మికులు కోల్పోయే వేతనాలు సుమారు రూ 13.07కోట్లు,ఒక్కరోజు ఉత్పత్తి 1.92 లక్షల టన్నులు నష్టపోవాల్సి ఉంటుందన్నారు.గత ఆర్థిక సంవత్సరంలో 69.01 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి,65.27 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా జరిగిందని,దాని ద్వారా కార్మికులకు లాభాల బోనస్,పి ఎల్ ఆర్ బోనస్ లు చెల్లించడంతోపాటు వివిధ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు.ఈ ఆర్థిక సంవత్స రంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యానికి (72. మిగిలిన టన్నులు) గాను జూలై 1 వరకు కేవలం 22.4 శాతం మాత్రమే ఉత్పత్తి సాధించా మని,కార్మిక సంఘాలు గాని కార్మికులు గాని పునరాలోచించి సమ్మె ఆలోచన విరమించి లక్ష సాధన కోసం కృషి చేయాలని జిఎం కోరారు.ఈ సమావేశంలో యస్.ఓ.టు జియం ఆంజనేయ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి,ఎజంట్స్ చిలుక శ్రీనివాస్,రమేష్,ఓసి5 ప్రాజెక్ట్ అధికారి రమేష్,ఎసియంవో డాక్టర్ అంభిక,అధికారులు శివ నారాయణ, జితేందర్, ఫైడిశ్వార్,జితేందర్ సింగ్,ధన లక్ష్మి భాయి,అనిల్ గబాలే,పర్సనల్ అధికారులు వేణు,శ్రావణ్ కుమార్,పాల్గొన్నారు.

## బాసర ట్రిబుల్ ఐటీలో "ప్రగతి" విద్యార్థికి స్థానం

**రామగిరి, జూలై 8 (ప్రజాజ్యోతి) :**



రామగిరి మండల కేంద్రంలోని ప్రగతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థిని మౌటం కీర్తన 2025-26 విద్యా సంవత్సరానికి గాను బాసర ట్రిబుల్ ఐటీ (రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జీ టెక్నాలజీస్) లో సీటు సాధించి ప్రతిభ చాటింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అబ్బా కేశవరెడ్డి మాట్లాడుతూ "గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా కార్పొరేట్ స్థాయి విద్యకు పోటీగా నిలబడగలిగే సామర్థ్యం కలవారు అని మేము నిరూపిస్తున్నాము. కీర్తన సాధించిన ఈ విజయంతో మా పాఠశాల గర్విస్తుంది" అన్నారు. ఈ సందర్భంగా కీర్తనను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది హర్షాతిరేకాలతో అభినందించారు.

### సవాళ్లు విసరడం పారిపోవడం

## రేవంత్ రెడ్డికి కొత్తేమికాదు

**- ప్రజలను మాటలతో రెచ్చ కొట్టడం కాదు**

**- దమ్ముంటే బహిరంగ చర్చ కు రా**

**- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

**చొప్పదండి, జూలై 8(ప్రజా జ్యోతి):**



బహిరంగ చర్చకు రావాలి అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సి ఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరిన నేపథ్యంలో మంగళవారం బహిరంగ చర్చ కోసం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌కు తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెళ్తే ఎక్కడికి పారిపోయావ్ రేవంత్ రెడ్డి అని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రశ్నించారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే పత్రిక ప్రకటన విడుదల చేస్తూ,అప్పట్లో తొడకొట్టి పారిపోయింది ఎవరూ? 90లక్షల ఓట్లకి ఒక్క ఓటు తగ్గిన పేరు మార్చుకుంటా అని,కొడంగల్ లో ఓడిపోతే రాజకీయాలు వదిలేస్తా అని, జిహెచ్ఎంసి ఎన్నికల్లో 100 సీట్లు బిఆర్ఎస్ గెలిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తెలంగాణ భూభాగంలో కాళ్ళు పెట్టకుండా విడిచిపెట్టీ పోతానని సవాల్ స్వీకరించి పారిపోయింది ఎవరు అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంగళవారం కూడా సవాల్ విసిరి ముఖ్యమంత్రి ఢిల్లీ పారిపోయాడని రవిశంకర్ విమర్శించారు.

### పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్యాల ప్రతాప్‌కు

## న్యాయవాదుల ఘన సన్మానం

**కక్షిదారులకు నాణ్యమైన సేవలు అందించాలన్న బార్ అసోసియేషన్ మాజీఅధ్యక్షులు ఎర్రం రాజారెడ్డి..**

**కరీంనగర్: జూలై 8(ప్రజా జ్యోతి)**



కరీంనగర్ జిల్లా ప్రిన్సిపల్ కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియామితులైన మల్యాల ప్రతాప్ ను కరీంనగర్ బార్ అసోసియే షన్ మాజీ అధ్యక్షులు ఎర్రం రాజారెడ్డి ఆధ్వర్యంలో వారి న్యాయవాద బృందం కలిసి హార్థిక శుభాకాంక్షలు తెలియజేసి శాలువా కప్పి మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షులు ఎర్రం రాజిరెడ్డి మాట్లాడుతూ కక్షిదారులకు నిత్యం అందుబాటులో ఉంటూ ఉన్నతమైనటువంటి న్యాయ సేవలు అందించాలని సూచించారు. న్యాయవాదులు అందరు కలిసి మల్యాల ప్రతాప్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమి తులందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవా దులు ఆశాడపు శ్రీనివాస్, జెల్ల రమేష్, కొమ్మినేని ప్రమోద్ కుమార్, బొజ్జ స్వామి, దాడి ఓంకార్ యాదవ్, నిషా సింగ్, శరణ్య, లింగారెడ్డి,అభిమానులు వాసాల రాజు పాల్గొన్నారు.

# సమ్మె విజయం చేస్తేనే సింగరేణికి,కార్మికులకు మనుగడ

**- కార్మికుల విధులకు దూరంగా ఉండాలి - సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక**

**గోదావరిఖని , జులై 8 (ప్రజాజ్యోతి)**



జాతీయ కార్మిక సంఘాలు బుధవారం తలపెట్టిన సమ్మెను విజయవంతం చేస్తేనే కార్మికులు తమ హక్కులను కాపాడుకోవచ్చిన సింగరేణి జాతి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం పది సంవత్సరాలుగా కొనసాగిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు,కార్పొరేట్ అనుకూల విధానాలకు వాటికి నిరసనగా బుధవారం తలపెట్టిన సమ్మెలో అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్మిక వర్గం 139 సంవత్సరాలు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను పార్లమెంట్ లో నాలుగు లేబర్ కోడుల గా మార్చిందనీ, దేశంలోని ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరణ చేస్తుందన్నారు. విదేశీ,స్వదేశీ పేరుతో ఈ దేశంలోని ప్రభుత్వ రంగ పరిశ్రమలను, సహజ వనరులను పెట్టుబడిదారులకు అప్పజెప్పి కార్మికులకు రక్షణగా ఉన్నటు చట్టాలు కూడా మార్చడం ద్వారా కార్మికుల్ని కట్టుబానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ ఆపాలని,కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని,8 గంటల పని దినాన్ని పరిరక్షించాలని,ప్రభుత్వ రంగ పరిశ్రమలు అమ్మకాన్ని ఆపాలని, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్,స్కీం వర్కర్ల క్రమబద్ధీకరణ చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు ఉద్యోగ భద్రత,పి ఎఫ్,ఈఎస్ఐ, పెన్షన్ తదితర చట్టబద్ధ హక్కులు అమలు చేయాలని,సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల ఈ సమావేశంలో ఐఎఫ్టియు జాతీయ ప్రధాన కార్యదర్శి టి. శ్రీనివాస్, ఏఐఎస్టియు రాష్ట్ర అధ్యక్షులు జి రాములు,సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు ఐ. కృష్ణ,పోగుల శేఖర్,ఏడు కొండలు,ఈ నరేష్,మాతంగి రాయ మల్లు,బి. అశోక్, ఐ. రాజేశం, జీ. మల్లేశం, రాజనర్సు, రాయపోశం, దామోదర్ రెడ్డి,ఎస్. ప్రసాద్, దుర్గం పోచయ్య, సారయ్య, రాజబాబు,ఎడ్ల రవికుమార్,సుందిళ్ల స్వామి,ధర్మేందర్,అవినాష్ పాల్గొన్నారు.

## ఎస్సై సాయి కృష్ణను కలిసి సన్మానించిన కాంగ్రెస్ నాయకులు..

**శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలన్న ఎస్సై...**

**చిగురుమామిడి: జూలై 08(ప్రజాజ్యోతి)**

మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలంతా సహకరించాలని చిగురుమామిడి ఎస్సై రేణికుంట సాయి కృష్ణ కోరారు. మంగళవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్సై సాయి కృష్ణను కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరిగిన,అక్రమ ఇసుక రవాణా జరిగిన వెంటనే సమాచారం ఇవ్వాలని వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రామచ గ్రామ శాఖ అధ్యక్షుడు వటకాల సంపత్ రెడ్డి, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు మహమ్మద్ షాబుద్దీన్,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అందేమేకల పరశురాములు,కాత తిరుపతి, మిట్టపల్లి ఆదర్శ్,కొండం మైపాల్ రెడ్డి,వంటకాల రంజిత్ రెడ్డి, వర్గా ఐలయ్య,జిల్లెల భగవాన్ ప్రసాద్,




జిల్లెల్ల రమేష్, ఆలకుంట యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## "డీట్" యాప్ పట్ల యువత, విద్యార్థులకు అవగాహన కల్పించాలి

**అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే**

**కరీంనగర్ బ్యూరో,జూలై 08, (ప్రజాజ్యోతి):**



నిరుద్యోగ యువత, విద్యార్థులకు ఉపాధి మార్గం చూపే ఏఐ ఆధారిత మొబైల్ యాప్ డీట్ పట్ల విస్తృత అవగాహన కల్పించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో డిస్టిక్ ఎంప్లాయ్మెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ (డిట్)పై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న పరిశ్రమలు, సంస్థలు, గ్రానైట్స్, రైస్ మిల్లులు ఈ యాప్ లో రిజిస్టర్ అయ్యేవిధంగా చూడాలన్నారు. ప్రైవేట్ సంస్థల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో యాప్ రూపొందించడం జరిగిందని తెలిపారు. ఐటిఐ, పాలిటెక్నిక్ తదితర కళాశాలల ఫైనల్ ఇయర్ విద్యార్థులు, యువత, స్కిల్ వర్కర్లు ఈ యాప్ లో నమోదయ్యేలా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఎంప్లాయర్లు తమకు కావలసిన అర్హత కలిగిన వారిని ఎంపిక చేసే అవకాశం ఉంటుందని, తద్వారా రాష్ట్రవ్యాప్తంగా అనేకమందికి ఉపాధి మార్గాలు లభిస్తాయని తెలిపారు. ఈ సమావేశంలో మెప్మా పీడీ వేణుమాధవ్, నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## జీవితం పై విరక్తి చెంది వృద్ధిరాలి ఆత్మహత్య

**ఇల్లందకుంట,జూలై08(ప్రజాజ్యోతి):**

ఆరోగ్య విషయంలో బాధపడుతూ జీవితం పై విరక్తి చెంది వృద్దిరాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇల్లందకుంట మండలం లో చోటుచేసుకుంది. మర్రివానిపల్లి గ్రామానికి చెందిన కాటిపల్లి అమృతమ్మ ( 70 ) కొన్ని రోజులుగా ఆరోగ్య బాగాలేదని జీవితంపై విరక్తి తో సోమవారం సాయంత్రం ఎవరు లేని సమయంలో బావిలో పడి మృతి చెందినట్లు మృతిరాలి కొడుకు కాటిపల్లి రవీందర్ రెడ్డి ఇల్లందకుంట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై క్రాంతికుమార్ ఇచ్చినాడు.



## మహిళ అదృశ్యం కేసు నమోదు

కొనరావుపేట:జూలై.8(ప్రజా జ్యోతి): కోనరావుపేట మండల కేంద్రంలో



పులి సంధ్య ( 30 )ఆరోగ్యం బాగాలేక మానసికంగా ఉండడంతో ఈనెల 3 నుండి కనిపించడం లేదని పులి సంధ్య భర్త పులి బాబు కొనరావుపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై ప్రశాంత్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు ఎవరికైనా సమాచారం తెలిస్తే 87 126 56 421 నెంబర్ కు ఫోన్ చేయాలని తెలిపారు.

## పోచమ్మ గుడి పునర్నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం

కోనరావుపేట:జూలై.8(ప్రజాజ్యోతి): కోనరావుపేట మండలం కొలనూరు గ్రామంలో



నిర్మిస్తున్న పోచమ్మ గుడి పునర్నిర్మాణానికి గ్రామానికి చెందిన సంకినేని సురేఖ విష్ణు ప్రసాదరావు రూ.3 లక్షల 116 లు విరాళం అందజేశారు. విష్ణు ప్రసాద్ రావు హైదరాబాద్లో వ్యాపారం చేస్తూ పుట్టిన ఊరు పై మమకారంతో గ్రామాభివృద్ధిలో భాగంగా తన వంతుగా గుడి నిర్మాణానికి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ గ్రామస్తులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం,జులై 08 ,ప్రజాజ్యోతి:పోగొట్టుకున్న సెల్ ఫోన్ ను



కరీంనగర్ రూరల్ పోలీసులు కనిపెట్టి మంగళవారంబాధితునికి అప్పగించారు,ఈ సందర్భంగా కరీంనగర్ రూరల్ సీఐ ఏ.నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ అరేపల్లి కి చెందిన బి.సాయి కిరణ్ అనే వ్యక్తి మార్చ్ 21న తన ఫోన్ అరేపల్లిలో పోగొట్టుకుని కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ లో కేసు పెట్టాడు, సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా మహబూబాబాద్ లో ఫోన్ ను కనుక్కుని, ట్రేస్ చేసి,మంగళవారం ఫోన్ ను బాధిత సాయి కిరణ్ కి అప్పగించామని తెలిపారు,ఫోన్ ను ట్రేస్ చేయడంలో కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజని సీఐ ఏ.నిరంజన్ రెడ్డి అభినందించారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

### కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి



కరీంనగర్ క్రైం,జులై 08 ,ప్రజాజ్యోతి:
ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి అన్నారు,మంగళవారం ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన ట్రాక్టర్ యజమానులు,డ్రైవర్ ల పై కరీంనగర్ రూరల్ పోలీసులు కేసులు నమోదు చేశారు, ఈ సందర్భంగా రూరల్ సీఐ మాట్లాడుతూ గతంలో అక్రమంగా,దొంగతనముగా చేగూర్తి శివారు లోని వాగు నుండి ఇసుకను తరలిస్తూ పట్టుబడ్డ కాశిపాక అర్జున్ తండ్రి నర్సయ్య (21),విలాసాగరం శేఖర్ తండ్రి మొండయ్య (31)లను తహసీల్దార్ ముందు మరొకసారి చట్ట వ్యతిరేక చర్య చేపట్టితే ఒక లక్ష రూపాయలు జరిమానా లేదా 6 నెలల జైలు శిక్ష విధించేట్లుగా పూచికత్తు పై బైండ్ ఓవర్ చేయడం జరిగిందన్నారు.అలాగే పేక ఆడుతూ పట్టుబడ్డ ఎనిమిది మంది వ్యక్తులను నేదునూరి సంపత్ , తూర్పాటి సంపత్,వస్తం దుర్గాప్రసాద్,తూర్పాటి రాములు,గంధం రమేష్,గంధం సంపత్, తూర్పాటి అంజయ్య,మొటం రమేష్ లను బైండ్ ఓవర్ చేయడం జరిగిందన్నారు,

## టి యు డబ్ల్యూ జే జిల్లా ఉపాధ్యక్షుడు బాలే శివప్రసాద్ కు ఎమ్మార్పీఎస్ ఘన సన్మానం

కాల్వ శ్రీరాంపూర్ మండలం లోని గంగారం గ్రామపంచాయతీ పరిధిలోని ఊషన్న పల్లె గ్రామానికి చెందిన బాలే శివప్రసాద్ సూర్య దినపత్రికలో విలేకరిగా విధులు నిర్వహిస్తున్నాడు ఈయన ఇటీవల పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన టియుడబ్ల్యూజే జర్నలిస్టు సంఘం ఎన్నికల్లో పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు ఈయనను ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం రోజున శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు దంతనపల్లి ధర్మయ్య ఎమ్మార్పీఎస్ నాయకులు బర్ల తిరుపతి తాండ్ర గోవర్ధన్



సురేష్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణ తో సీజనల్ వ్యాధులను అరికట్టాలి

### మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్..



జమ్మికుంట,జూలై08( ప్రజాజ్యోతి ) :
నీరు నిల్వ ఉన్న దోమ తన అండాలను విడుదల చేసి దోమల పెరుగుదల చేస్తుందని, దానిని నివారించడానికి జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని హరితనగర్ లో మంగళవారం మున్సిపల్ సిబ్బందితో కలిసి 100రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఆయిల్ బాల్స్ నీటిలో విడుదల చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ రానున్న వర్ష కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఈ ఆయిల్ బాల్స్ దోమ గుడ్లను ఎదగకుండా పూర్తిగా నిర్మూలిస్తుందన్నారు. జూన్ 2నుండి ప్రారంభమైన 100రోజుల ప్రత్యేక కార్యక్రమంలో ప్రతి రోజు ఒక కార్యక్రమం చొప్పున మున్సిపాలిటీ మార్పు అభివృద్ధి వైపు అనే నినాదంతో ముందుకు అడుగులు వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఓపెన్ ప్లాట్లలో చెత్త చెదరలతో ఉన్నందున వారికి పలుమార్లు నోటీసులు ఇచ్చామని, వారి ప్లాట్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పలుమార్లు తెలిపామన్నారు. అయిన పట్టించుకోని వారి ప్లాట్లను మున్సిపల్ పరంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులలో మున్సిపల్ ఏఈ, టౌన్ ప్లానింగ్ అధికారులు తిరుగుతూ ఎక్కడైతే రోడ్లు, డ్రైన్ అవసరం ఉన్నాయో వాటి వివరాలు సేకరించారని, వాటిని డీఎంఏ దృష్టికి తీసుకెళ్లడం జరిగినట్లు ఆయన తెలిపారు. బహుశా ఇంకో 15-20 రోజులలో నిధులు మంజూరు కావొచ్చని, నిధులు మంజూరు కాగానే వార్డులలో అవసరమయ్యే పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని కమిషనర్ మహమ్మద్ అయాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్, సదానందం, ప్రజా ప్రతినిధులు సాయిని రవి, శ్రీపతి నరేష్, పిట్టల రమేష్, మున్సిపల్ సిబ్బంది మున్సిపల్ జవాన్లు, పరిశుద్య కార్మికులు పలువురు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమ పితామహుడు వైఎస్ రాజశేఖరరెడ్డి



ఇల్లందకుంట,జూలై08( ప్రజాజ్యోతి ):
దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఇల్లందకుంట మండల పార్టీ అధ్యక్షులు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా పెద్ది కుమార్ మాట్లాడుతూ... డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వైద్యుడిగా సేవలు ప్రారంభించి ఎంతో గొప్ప పేరు తెచ్చుకున్నారని అన్నారు. ఒక రూపాయికే వైద్యం అందించి పేద ప్రజలకు వైద్యం అందించిన గొప్ప వ్యక్తి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 1978 లో రాజకీయాల్లో ప్రవేశించి ఎమ్మెల్యేగా, ఎంపీగా, ముఖ్యమంత్రిగా పనిచేసి ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందారు. "పీపుల్స్ లీడర్"గా పేరుగాంచారు. జనహక్కులకోసం అతను నియమించిన విధానం, ప్రజలకు అన్ని సమయాల్లో అందుబాటులో ఉండటం ప్రజాదరణకు పునాది వేసింది. 1999%-%2004లో ఆంధ్రప్రదేశ్ లీడర్ ఆఫ్ అపోజిషన్గా ఎంతో చురుకైన పాత్ర పోషించి పాదయాత్ర ద్వారా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చారు. 2004లో మొదటి సారి సీఎంగా బాధ్యత తీసుకున్నారు. ఈ సమయంలో "పాదయాత్ర" ద్వారా తెలుసుకున్న ప్రజా సమస్యలపై ఆయన దృష్టి సారించారు, ప్రజా సంక్షేమం పట్ల ఆయన నిబద్ధతతో, అకుంఠిత దీక్షతో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారు అమలు చేసి ప్రజా బంధువు అయ్యారు, అందులో భాగంగానే, రైతుల సంక్షేమం వంటి పథకాలతో ప్రజాసేవకు ప్రాధాన్యత ఇచ్చారు.ఫ్రీ ఎలక్ట్రిసిటీ (రైతులకు మొదటే రోజు నుంచి), "రాజీవ్ ఆరోగ్యశ్రీ" మెడికల్ స్కీం, ఇందిరమ్మ హౌసింగ్, పింఛన్ల పెంపు, ఫీ రీయంబర్స్మెంట్, 108, మొదలైన పలు గొప్ప సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఇంగిలేరామారావు, కనుమల్ల సంపత్, కనుమల్ల రామకృష్ణ, బుర్ర రమేష్, గంగారం మహేష్, మారేపల్లి ప్రశాంత్, పెద్ది శివకుమార్, ధర్మకర్తలు గుడిశాల పరమేశ్వర్, కోరుమిండ్ల చిరంజీవి, మూడెత్తుల మల్లేష్, బొమ్మ శ్రీనివాస్, ఎడ్ల కృష్ణ రెడ్డి, కార్మికుల రాజేందర్, గ్రామ శాఖ అధ్యక్షులు మీస రాజయ్య బండి మల్లయ్య మూడెడ్ల రమేష్ తెడ్ల బీరయ్య ఎంతిరుపతిరెడ్డి గుండారపు సాయికుమార్ మన్నాని రవి దంసాని తిరుపతి భోగం చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం లోనే గ్రామాల అభివృద్ధి

**-అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తాం -పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు**





**సుల్తానాబాద్ జులై 8 (ప్రజా జ్యోతి)** సుల్తానాబాద్ మండలంలోని కందునూరిపల్లి, నారాయణపూర్, కొదురుపాక దేవునిపల్లి చిన్నకల్వల గ్రామాల్లో మంగళవారం రోజున సిసి రోడ్లు, డ్రైనేజీలు, హెల్త్ సెంటర్, కమ్యూనిటీ హాల్, బోర్ వెల్ శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను అందజేసి ముగ్గులు పోసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు అనంతరం సుల్తానాబాద్ మండలం నారాయణపూర్ గ్రామంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలలో పాల్గొని కేక్ కట్ చేసిన అనంతరం వైయస్ రాజశేఖర్ రెడ్డి సేవలను కొనియాడారు.

**ఈసందర్భంగాఎమ్మెల్యేవిజయరమణరావు మాట్లాడుతూః**ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి గ్రామంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు అందించి వారి కళ్ళల్లో ఆనందం చూసేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే విజయరమణ రావు అన్నారు. సంవత్సరం నర కాలంలోనే ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేస్తున్నామని ప్రతి గ్రామంలో లక్షలాది రూపాయలతో సిసి రోడ్లు డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నామని అందులో భాగంగా నేడు కందునూరిపల్లి గ్రామంలో 56 లక్షల రూపాయల సిసి రోడ్లు డ్రైనేజీలు నారాయణపూర్ గ్రామంలో 37 లక్షల 50 వేల సిసి రోడ్ డ్రైనేజీలు 25 ఇందిరమ్మ గృహాల మంజూరు కొదురుపాక గ్రామంలో 26 లక్షల రూపాయలతో హెల్త్ సెంటర్ దేవునిపల్లి గ్రామంలో 25 లక్షల రూపాయలతో సీసీ రోడ్లు డ్రైనేజీలు కమ్యూనిటీ హాల్ బోర్ వెల్ నిర్మాణాలు చేపట్టామని అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డును అందిస్తున్నామని గత పది సంవత్సరాలు రేషన్ కార్డ్ డబుల్ బెడ్ రూమ్ ఇచ్చిన పాపాన గత ప్రభుత్వం పోలేదని ఇచ్చిన మాట ప్రకారం రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇల్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో 31 కోట్ల రూపాయల బోనస్ ను అందించిన ఘనత తమదేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టినప్పటి నుండి చివరి ఆయకట్ట వరకు రైతులకు నీరందిస్తున్నామని 29 రాష్ట్రాలలో సన్న బియ్యం ఇచ్చిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వమేనని పేర్కొన్నారు. రేషన్ కార్డుల ద్వారా నిరు పేదలందరికీ సన్న బియ్యం అందించి మూడు పూటలా భోజనం చేసేలా తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. 80% పై చిలుకు మందికి కరెంట్ బిల్లు ఉచితంగా వస్తుందని అన్నారు గత పాలకులు దళిత కాలనీలను చీకటిమయం చేసి వారు, కారు చీకట్లో మగ్గేలా పాలనను కొనసాగించారని ముక్కు పిండి కరెంట్ బిల్లులు బస్సులు చేసిన సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంట్ ఇచ్చిన ఘనత తమదేనని పేర్కొన్నారు. 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని ఫ్రీ బస్సు ను మహిళలకు అందిస్తున్నామని రైతు భరోసాను ఇచ్చామన్నారు. సన్న వడ్లకు బోనస్ ఇచ్చిన ప్రభుత్వం తమదేనని పేర్కొన్నారు. బి.ఆర్.ఎస్ పాలనలో సన్న వడ్లు పండించాలని చెప్పి రైతులను నట్టేట ముంచారని పేర్కొన్నారు. రైతులు పండించిన పంటకు వడ్లు కటింగ్ లేకుండా కొనుగోలు చేసిన ఘనత తమదేనని నియోజకవర్గంలో గతంలో ఇసుకను అమ్ముకున్న పాలకులు ఉన్నారని ప్రస్తుతం తాము అతి చౌకగా ఇసుకను అందిస్తున్నామని అన్నారు. సంవత్సర నర కాలం పూర్తయిందని ఇంకా మూడున్నర సంవత్సరాల కాలం మిగిలి ఉందని ఇచ్చిన హామీలను అన్నింటిని దశలవారీగా అమలు పరస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రేషన్ కార్డుల ఇందిరమ్మ గృహాల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దివ్యదర్శనరావు, పంచాయతీ రాజ్ ఏ.ఈ, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిలక సతీష్ మాజీ ఎంపీటీసీ సభ్యులు పన్నాల రాములు మండల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దామోదర్ రావు, కల్లేపెల్లి జానీ పట్టణ అధ్యక్షుడు వేగోళం అబ్బాయి గౌడ్ కొండలరావు మాధవరావు మాజీ సర్పంచ్ పన్నాల తిరుపతి రఘుపతిరావు సాగర్ రావు ఏరుకొండ రమేష్ తిరుపతి వర్ధినేని సాగర్ రావు భూషణ వేణి రాజాగౌడ్ శ్రీనివాస్ గౌడ్ కల్లేపెల్లి శంకర్ రాజమల్లు ఎలిగేటి సదానందం మారేడు గుండా సది ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు యూత్ కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులు, పలు గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు పోలీసులు సేవ చేయాలి

**రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్**



**కాల్వ శ్రీరాంపూర్ ప్రజా జ్యోతి జూలై 8ః** పోలీసులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు సేవ చేయాలని రామగుండం సిపి అంబర్ కిషోర్ పోలీసులకు సూచించారు కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో గల పోలీస్ స్టేషన్ను ఆయన మంగళవారం రోజున ఆకస్మిక తనిఖీ చేశారు స్టేషన్ కు నూతనంగా వచ్చిన ఆయనను పోలీస్ అధికారులు పుష్పగుచ్చాలను అందజేసి స్వాగతం పలికారు పోలీస్ స్టేషన్లో గల పరిసరాలను పరిశీలించారు పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనా ఆయా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు రికార్డులను పరిశీలించారు పోలీస్ సిబ్బంది వివరాలను వారి పనితీరును అడిగి తెలుసుకున్నారు మీకేమైనా సమస్యలు ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు మావోయిస్టు కుటుంబాల వివరాలు ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయి వాటిని ఏ విధంగా పరిష్కరిస్తున్నారు అడిగి తెలుసుకున్నారు పెండింగ్ కేసులు ప్రస్తుత కోర్టు కేసులు దర్యాప్తులో ఉన్న కేసులు ఆయన క్షుణ్ణంగా పరిశీలించి ఆ కేసులపై పలు సూచనలు ఇచ్చారు పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు పోలీసులు విధుల పట్ల క్రమశిక్షణతో మెలగాలన్నారు అనంతరం మొక్కలు నాటారు ఈయన వెంట డిసిపి కరుణాకర్ ఏసీ పిగజ్జి కృష్ణ సిఐ సుబ్బారెడ్డి ఎస్ఐ వెంకటేష్ పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ప్రత్యేక అధికారి నియామకం



**కొడిమ్యాల,జూలై 08,(ప్రజాజ్యోతి):** మండల ప్రత్యేకాధికారిగా మంగళవారం జిల్లా హార్టికల్చర్ అధికారి శ్యామ్ ప్రసాద్ మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ స్వరూప,సీనియర్ సహాయకులు సురేష్,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్ జయంతి వేడుకలు



**కోరుట్ల జులై 08 ప్రజాజ్యోతి ప్రతినిధిః**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను కోరుట్ల పట్టణంలో గల జువ్వాడి కృష్ణారావు స్వగృహం జువ్వాడి భవన్ లో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల పెన్నిధి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని తరాలు మారిన ఆయన పాలనను ఎవరు మర్చిపోలేదన్నారు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా చేసిన కాలంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఆరోగ్యశ్రీ, ఫీజు రియంబర్స్మెంట్, జలయజ్ఞం, రైతు రుణమాఫీ,పలు సంక్షేమ పథకాలు, ప్రవేశపెట్టడమే కాకుండా విద్యుత్ రంగం రోడ్ల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యతను ఇచ్చారని కొనియాడారు ఆయన 29 సంవత్సరాలకే అసెంబ్లీలో పులివెందుల నుండి అడుగుపెట్టారని 1983లో అంటే కేవలం 35 సంవత్సరాల వయసుగల ఆయన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేపట్టిన నాయకుడుగా చరిత్ర సృష్టించాలన్నారు ఐదు సార్లు ఎమ్మెల్యేగా నాలుగుసార్లు ఎంపీగా గెలిచి పార్టీ అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న తాను మాత్రం పదవిలోనే కొనసాగాడని అలాగే 2004 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడానికి ముఖ్య పాత్ర పోషించి ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు స్వీకరించారన్నారు. అనంతరం ఆయన ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలుపరచి ప్రజల గుండెల్లో ఒక చేదరని ముద్ర వేసుకున్న గొప్ప నాయకుడని తెలిపారు ఈ కార్యక్రమంలో తిరుమల గంగాధర్ తో పాటు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎంఏ నయీమ్,మ్యాకల నర్సయ్య, చిటిమెల్లి రంజిత్, కుమార్ గుప్తా, కోరుట్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఎలేటి మహిపాల్ రెడ్డి, మైనారిటీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు వసి ఉర్ రహమాన్ వసీం, పట్టణ నాయకులుఆడెపు మధు, వెంకటేశ్వర దేవాలయ అధ్యక్షులు ఎతిరాజం, నర్సయ్య, ధర్మకర్తలు నేతి శ్రీనివాస్, కటుకం దివాకర్, గోడికే రాములు, కోట గంగాధర్, రిజ్వాన్ పాషా, చిట్యాల లక్ష్మీనారాయణ, పెండెం రమేష్,కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి వివేక్ ను కల్సిన జువ్వడి కృష్ణారావు



**కోరుట్ల జులై 08 ప్రజాజ్యోతి ప్రతినిధిః**తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వీవేక్ వెంకటస్వామి తో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వడి కృష్ణారావు ఈరోజు హైదరాబాద్ లో సచివాలయం నూతన ఛాంబర్ లో భేటీ అయ్యారు. రాష్ట్ర గ్రంధాలయసంస్థ చైర్మన్ రియాజ్ తోపాటు మంత్రి ని మర్యాద పూర్వక ముగా కలసి నట్లు జువ్వడి కృష్ణారావు పేర్కొన్నారు.

# కేటీఆర్ నాతో పెట్టుకుంటే నాశనమైపోతావ్

## - మీడియా సమావేశంలో ఫైర్ అయిన మంత్రి సీతక్క



నాపై బిఆర్ఎస్ వాళ్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారు.నాతో పెట్టుకుంటే కేటీఆర్ నాశనమైపోతావని మంత్రి సీతక్క ఫైర్ అయ్యారు. మంగళవారం ములుగులో మంత్రి సీతక్క విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు.నాకు నీలాగా కుల,ధన బలం లేదు.నా నియోజకవర్గ ప్రజలే నాకు బలం.నీ చెల్లి నీ మీద దుమ్మెత్తి పోస్తోంది. ముందుగా అది చూసుకో.. కేటీఆర్ మిడతల దండుతో ములుగుపై పడ్డాడు అంటూ మండిపడ్డారు.చిల్లర రాజకీయాలు మానండి నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వివరించండి.కేటీఆర్ మీ చెల్లి నీమీద దుమ్మెత్తి పోస్తుంది.ఆమె సంగతి ఏందో చూడుమని సలహా ఇచ్చారు.నాతో పెట్టుకుంటే నీకు వచ్చేది ఏంలేదు. నీలాగా కుల బలము తన బలము అహంకార బలము నావద్ద లేదని,నాకెవరూ లేరు.ఉన్న అన్న కూడా ఉద్యమంలో చనిపోయాడని పేర్కొన్నారు.నాకు నియోజకవర్గమే నాకు అండ అని,ములుగు ప్రజలు దీవిస్తే మంత్రిని అయ్యానని అన్నారు.నువ్వు నిర్వహించిన పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కు నేను మంత్రయితే కేటీఆర్ తట్టుకోవట్లేదని అన్నారు.అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.అబద్ధపు ప్రచారం చేస్తే కేటీఆర్ నాశనమై పోతాదని తెలిపారు.ఇంట్లో ఆడబిడ్డను నువ్వు కుట్రలు కుతంత్రాలతో వేధిస్తున్నావు.ములుగులో ఇందిరమ్మ పాలన ప్రజాస్వామ్య పాలన సాఫీగా సాగుతోంది. ఇబ్బందులు నిర్బంధాలు లేవు,నామీద ఉన్న అభిమానాన్ని,ములుగు అభివృద్ధిని అడ్డుకునేందుకు కేటీఆర్ కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు.పక్క నియోజకవర్గాల్లో చిత్తుగా ఓడిపోయి అక్కడ ఎవరు పట్టించుకోక ఇక్కడికి వచ్చి డ్రామాలు చేస్తున్నారు. కేటీఆర్ నిజంగా మనిషి అయితే పోలీసు రాజ్యం ములుగులో ఉందని నిరూపిస్తావా..? అని మండిపడ్డారు.మీహాయంలో మా కార్యకర్తల మీద ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేశారు.లక్ష్మీదేవిపేట,చల్వాయితో పాటు ఎన్నో గ్రామాల యువకుల మీద మీరు కేసులుపెట్టి వేధించారు.చర్చకు సిద్ధమా..?అని ప్రశ్నించారు.ములుగులో శాంతియుత వాతావరణం ఉంది.ప్రజా స్వామ్య పాలన కొనసాగుతోందని అన్నారు. దొర అహంకారంతో కుట్రలను రాష్ట్ర ప్రజలు ములుగు ప్రజలు అర్థం చేసుకున్నారు.మీరు శాంతి యుత ధర్నా చేసుకుంటామని చెప్పి మంత్రుల కాన్వాయ్ ని అడ్డుకునే ప్రయత్నం ఎందుకు చేశారని ప్రశ్నించారు.మీకు రాజకీయ డ్రామాలు తప్పా..బాధిత కుటుంబాలను ఆదుకునే సోయిలేదు.ములుగు నియోజకవర్గంలో 90 శాతం ఎస్సీ,ఎస్టీ,బిసి పోలీస్ అధికారులు ఉన్నారు.వారి మనోస్థైర్యాన్ని దెబ్బతీసేలా మీరు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.మీ హయాంలో ములుగు నియోజకవర్గంలో మీ మంత్రులు పర్యటిస్తే విపక్ష నేతలను హౌస్ అరెస్టులు చేసేవారని,తాగడానికి కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. చల్వాయిలో రమేష్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకుంటే..మమ్మల్ని నిందించడానికి బుద్ధి ఉండాలి.ఆ కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చామని తెలిపారు.మీరు ప్రజలను పొట్టన పెట్టుకుంటే మేము కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నామని తెలిపారు.మీ పాలనలో బిఆర్ఎస్ నేతల వేధింపులకు ఎందరో బలయ్యారని,సూసైడ్ లేఖలు,సెల్ఫీ వీడియోలు తీసుకొని ఆత్మహత్యలు చేసుకున్నారు.సిరిసిల్లలో ఇసుక లారీలతో ప్రజలను తొక్కించి చంపించిన చరిత్ర మీదని,మంథనిలో అడ్వకేట్ దంపతులను నరికి చంపింది ఎవరని ప్రశ్నించారు.సిద్దిపేటలో ఆటో డ్రైవర్ శిలాసాగరం రమేశ్ కు డబల్ బెడ్ రూం రాకుండా మీ బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అడ్డుకుంటే సిద్దిపేట కలెక్టరేట్ వద్ద పురుగుల మందు తాగి సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు.కొత్తగూడెంలో అప్పటి ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కొడుకు బిఆర్ఎస్ పార్టీ నేత రాఘ వేంద్ర వేధింపులు తాళలేక ఓ కుటుంబం సూసైడ్ చేసుకుంది.మెదక్ జిల్లా రామాయంపేటలో మీ నేతలు వేధిస్తున్నారని తల్లి, కొడుకు పద్మ,సంతోష్ సెల్ఫీ తీసుకుని పెట్రోల్ పోసుకుని సూసైడ్ చేసుకున్నారు.మీ మంత్రి పువ్వాడ అజయ్ బెదిరింపులతో ఖమ్మంలో సాయి గణేష్ అనే యువకుడు సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడని,ఇలా ఎందరో మీ వేధింపులకు బలిఅయితే,ఆ కుటుంబాను కనీసం పరామర్శించలేదని విమర్శించారు.ముఖ్యమంత్రిని వ్యక్తిగతంగా దూషించే కేటీఆర్ కు సంస్కారం లేదు..కేటీఆర్ కు ఒళ్లంతా దూరంకారమే ఉంది.ఉద్యమ సమయంలో జనాలను రెచ్చగొట్టి చనిపోయేలా చేసి మీరు మాత్రం అధికారం అనుభవించారని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో ములుగులో కనీసం వేయి ఇండ్లు కట్టించి ఇవ్వలేదు.మీకు మాట్లాడే అర్హత ఉందా..?అధికారం కోసం చావులకు ప్రేరేపించిన చరిత్రమీదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హటావో.. బంజారా బచావో

## -సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు సంజీవ్ నాయక్.

**బయ్యారం,జులై 8. ప్రజా జ్యోతి:**



కాంగ్రెస్‌ను గద్దె దించితేనే బంజారాల బతుకులు మారతాయని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు సంజీవ్ నాయక్ అన్నారు.మంత్రివర్గంలో లంబాడాలకు స్థానం కల్పించకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేస్తూ మంగళవారం కాంగ్రెస్,రేవంత్ హటావో.. బంజారా బచావో అనే నినాదాన్ని ఇచ్చి మాట్లాడారు.బంజారా ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలకు ఏ మాత్రం పౌరుషం ఉన్నా వెంటనే తమ పదవులకు రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు.లంబాడాలకు మంత్రివర్గంలో స్థానం కల్పించకుండా సామాజిక న్యాయం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. లంబాడాలను కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నదని,తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.ఏకపక్షంగా బంజారాలు కాంగ్రెస్ పార్టీ కి ఓట్లు వేస్తే ఈ ప్రభుత్వం బంజారాలకు అన్యాయం చేసిన విషయాన్ని సంజీవ్ నాయక్ గుర్తు చేశారు.గోర్ బోలి ని ఐదోవ 5 షెడ్యూల్ లో చేర్చాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సంజీవ్ నాయక్ మాట్లాడుతూ లగచర్ల,పోడుకు తోడు పాద యాత్ర, సంత్ శ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ ఫిబ్రవరి 15 ప్రభుత్వ అధికార జయంతి, తండాల పంచాయితీ సేవాలాల్ సేన సంఘ గొప్ప విజయాలన్నారు.60 నియోజకవర్గాలలో ఓట్ల ద్వారా గెలుపు ఓటములు ప్రభావితం చేయగల బంజారాలకు కనీసం ఒక్క మంత్రి పదవి కూడా కపోవడం దారుణం అన్నారు.జీఓ నెంబర్ 3 స్థానంలో మారో జీఓ తెచ్చి గిరిజన ఉద్యోగస్తులకు,నిరుద్యోగులకు న్యాయం చేయాలనీ సంజీవ్ నాయక్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మండల కేంద్రంలో సందర్శించిన డిఎంహెచ్వో

**కొనరావుపేట:జులై.8(ప్రజా జ్యోతి)**



కొనరావుపేట మండల కేంద్రంతో పాటు కనగర్తి గ్రామాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా: రజిత సందర్శించారు డ్రై డే ఫీవర్ సర్వే గురించి అడిగి తెలుసుకున్నారు ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన చేశారు నీటి నిలువలు లేకుం డా ఉండాలని తెలియజేశారు జ్వరాలు ఉన్నట్లయితే టెస్టులు మందులు అందుబా టులో ఉన్నాయని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డా:అనిత వైద్యాధికారి వేణుమా ధవ్ సిహెచ్ఓ బాలచంద్రం కృష్ణమూర్తి లింగం ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# ఉద్యానవన పథకాలపై రైతులకు అవగాహన

**చొప్పదండి, జూలై 8 (ప్రజాజ్యోతి):**



చొప్పదండి రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఉద్యానవన పథకాల మీద రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానవన శాఖ జిల్లా అధికారి కమలాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, రాయితీల గురించి వివరించారు. పండ్ల తోటల పెంపకం, కూరగాయల సాగు, పూల సాగు, యంత్ర పరికరాలు, సూక్ష్మ నీటి సేద్యం, ఆయిల్ పామ్ తదితర పథకాలకు ప్రభుత్వం రాయితీలు ఇస్తుందని తెలిపారు. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, బ్యాంకు పాస్ బుక్ జిరాక్సులు, ఫోటోతో వ్యవసాయ అధికారిని లేదా ఉద్యానవన అధికారిని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**ఎరువుల దుకాణాల తనిఖీ**

చొప్పదండిలోని ఎరువుల దుకాణాలను జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మంగళవారం తనిఖీ చేశారు. ఎరువుల రిపోర్టు, స్టాక్ రిపోర్టు, స్టాకు బుక్కులు, ఈపిఓఎస్ మిషిన్లను పరిశీలించారు. అడిషనల్ కలెక్టర్ వెంట మండల వ్యవసాయ అధికారి వంశీకృష్ణ తదితరులు ఉన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ కొడకండ్ల ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహణ

**జనగామ (కొడకండ్ల) జూన్ 8 (ప్రజాజ్యోతి) :**



లయన్స్ క్లబ్ ఆఫ్ కొడకండ్ల ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని పద్మశాలి మార్కండేయ భవనంలో మల్లా రెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ హైదరాబాద్ వారి సహకారంతో హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రజల నుండి అపూర్వ స్పందన లభించింది కొడకండ్ల మండల కేంద్రంతో పాటు పక్క గ్రామాల ప్రజలు 400 మంది వరకు ప్రజల హెల్త్ క్యాంప్ లో పరీక్షలు చేయించుకున్నారు. హైదరాబాద్ నుండి వచ్చిన 10మంది వైద్య బృందంచే వివిధరకాల జబ్బులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసారు. అవసరమైన వారికి పరీక్షలు, స్కానింగ్, ఆపరేషన్లు కొరకు ఉచితంగా బుధవారం ఉదయం 9 గంటలకు పద్మశాలి భవన్ వద్ద బస్సు ఏర్పాటు చేసి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రీజియన్ చైర్మన్ దామెర సరేష్, జోన్ చైర్మన్ చిదురాల నవీన్ కుమార్ పాల్గొన్నారు. హాస్పిటల్ వైద్యులు మాట్లాడుతూ అవసరమైన వారికి వైద్య పరీక్షలు, స్కానింగ్ బుధవారం హాస్పిటల్ లో ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమములో 400 మందికి బీపీ షుగర్ ఈసీజీ పరీక్షలు, కంటిపరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సహకరించిన లయన్ సభ్యులకు క్లబ్ అధ్యక్షుడు గాజుల రాములు, ప్రధాన కార్యదర్శి పసునూరి మధుసూదన్ , ట్రెజరర్ నేతి కొండయ్య ధన్యవాదములు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం, గ్రామ ప్రజలు, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.